



రాత్రి నిరసన కొనసాగిస్తున్న రైతులు

- ఇందిర సౌర గిరి జలవికాస్ పథకంతో పోడు రైతులకు లబ్ధి
- ఒక్కో యూనిట్‌కు రూ.6లక్షల వరకు కేటాయింపు
- నీటి వసతితో గిరి రైతుల ఆర్థికాభివృద్ధి

పోడు భూముల్లో సౌర సొబగులు



బెజ్జూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పోడు భూములు అనగానే సాధారణంగా జీడిమామిడి, మామిడి, పత్తి తోటలే గుర్తుకొస్తాయి. సౌర విద్యుత్తు రాకతో అలాంటి భూముల్లో జల సవ్వడులు వినిపించనున్నాయి. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న 'ఇందిర సౌర గిరి జలవికాస పథకం' ద్వారా గిరి జనుల పోడు భూములు వాణిజ్య పంటలకు నెలవు కానున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని లాంచనంగా ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో పోడు భూముల్లో అంగుళం కూడా బీడు వారకుండా చూస్తామని అధికారులు చెబుతున్నారు. 2025-26నుంచి 2029-30వరకు ఐదేళ్ల పాటు ఏటా జిల్లాల వారీగా రైతులు, ఎకరాల లక్ష్యాన్ని నిర్దేశిస్తారు.

● అర్హులు ఎవరంటే..

రైతులు రెండున్నర ఎకరాల పోడు భూమి కలిగి ఉండాలి. ఆ భూమిలో బోరు వేస్తారు. సోలార్ ద్వారా విద్యుత్తు కనెక్షన్ ఇస్తారు. ఐటీడీఏ సహకారంతో మోటార్లు అమర్చుతారు. బిందుసేద్యం సరికరాలు ఏర్పాటు చేసి నీటిని అందించేలా చూస్తారు. 5-7.50హెచ్‌పీ వరకు మోటార్ల సామర్థ్యం ఉండనుంది. రాష్ట్రంలో పోడు హక్కు పత్రాలు అందుకున్న గిరిజనుల భూముల్లో బోర్లు, మోటార్లు, సోలార్/విద్యుత్తు కనెక్షన్, బిందుసేద్యం పరికరాలను నూరుశాతం రాయితీపై అందించనున్నారు. ఈ పథకం అమలుకు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలోని గ్రామాలను ఎంపిక చేశారు. విద్యుత్తు లైన్లు లేని పోడు భూముల్లో సోలార్ ప్యానెళ్లు, బోరు మోటార్ల ద్వారా నీటిని సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

● అటవీ భూముల్లో సాగు చేస్తూ..

అటవీ భూములు సాగు చేసుకొని జీవనం పొందుతున్న గిరిజన రైతులకు ప్రభుత్వం పోడు పట్టాలు అందజేసింది. పోడు భూముల్లో బోరు వేసి సౌర విద్యుత్తు పంపు సెట్లతో నీరందించే లక్ష్యంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. పోడు పట్టాలు కలిగిన రైతులకు కనీసం 2.5ఎకరాలకు ఒక యూనిట్ మంజూరు చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అంతకంటే తక్కువగా ఉన్నట్లయితే చుట్టు పక్కల వారిని కలిపి గ్రూపుగా ఏర్పాటు చేసి మంజూరు చేస్తోంది. ఇలా ఒక్కో యూనిట్‌కు విలువ రూ.6లక్షలు కేటాయించారు. బోర్లు వేసేందుకు యంత్రం వెళ్లలేని ప్రాంతాల్లో బావుల్లో బోర్లు(ఓపెన్ వెల్స్) తవ్వవచ్చని ప్రభుత్వం పేర్కొంది. కానీ యూనిట్ విలువకు మించొద్దని పేర్కొంది. పథకం కింద ఎంపిక చేసిన రైతుత చేలల్లో బోర్లు, బావులు, సౌర విద్యుత్తు, పలకలు, మోటార్లు వంటివి ఏర్పాటు చేసి నీటి వసతి కల్పించనుంది.

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 2007, 2021-22లో ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు జారీ చేసింది. ఇంకా జిల్లా వ్యాప్తంగా పలువురికి పట్టాలు రాని వారు కూడా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల్లో సౌర విద్యుత్తు మంజూరు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లకు గాను 61,154 మంది పోడు రైతులకు 1,93,158ఎకరాల్లో నీటి వసతి కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లకుగాను 2025-26లో 1101 మంది రైతులకు 3034ఎకరాలు, 2026-27లో 5710మంది రైతులకు 18,281ఎకరాలు, 2027-28లో 5710మంది రైతులకు 18,281ఎకరాలు, 2028-29లో 5710మంది రైతులకు 18,281ఎకరాలు, 2029-30లో 5710మంది రైతులకు 18,281ఎకరాలకు సౌర విద్యుత్తు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

● కమిటీల పర్యవేక్షణలో..

పోడు భూముల్లో ప్రభుత్వం సోలార్ విద్యుత్తు కల్పించేందుకు నిర్ణయం తీసుకోవడంతో ఇందుకోసం జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేయనుంది. జిల్లా స్థాయి కమిటీలో చైర్మెన్‌గా కలెక్టర్, ఐటీడీఏ పీవో, అదనపు కలెక్టర్(రెవెన్యూ), మెంబర్ కన్వీనర్లుగా, గిరిజన, సాంఘీక సంక్షేమ శాఖ, రెవెన్యూ, రెడ్కో, డీఆర్‌డీవో, డీఎఫ్‌వో, గ్రౌండ్ వాటర్, విద్యుత్తు, ఆర్‌అండ్‌బీ, పీఆర్, నీటిపారుదల, డీపీవో, డీటీవో, ఉద్యాన,వ్యవసాయ అధికారులు సభ్యులుగా ఉంటారు. మండల స్థాయి కమిటీ చైర్మెన్‌గా ఎంపీడీవో, ఆయా శాఖల నుంచి సభ్యులుగా ఉంటారు. ఇప్పటికే మండలాల వారిగా పోడు పట్టాలు కలిగిన ఎస్టీ రైతుల గుర్తింపు కొనసాగుతుంది. జూన్ 10వరకు క్షేత్రస్థాయిలో ఆ భూముల్లో భూగర్భ జలశాఖ అధికారులు పరిశీలించి నీటి వసతి అంచనాలను సిద్ధం చేయాలి.వాటిని మండల కమిటీ ద్వారా జిల్లాకు, కలెక్టర్ పరిశీలించి ఆమోదం కోసం జిల్లా ఇన్‌చార్జీ మంత్రికి పంపించడం జరుగుతుంది.

ప్రభుత్వ నిర్ణయంతో మేలు..
- పేదం లింగయ్య, పెద్ద సిద్దాపూర్



రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు సౌర విద్యుత్తు సౌకర్యం కల్పించడంతో మేలు జరుగుతుంది. ఇప్పటికే ప్రభుత్వ పోడుకు పట్టాలు ఇచ్చింది. నీటి వసతి లేక ఇబ్బంది పడుతున్న మాకు సౌర విద్యుత్తు సదుపాయం కల్పించడంతో మేలు జరుగుతుంది. నీటి వసతితో ఏడాదిలో రెండు పంటలు తీసుకునే అవకాశం ఉంది.

మూడు రోజులుగా రైతుల నిరసన



అస్వస్థతకు గురైన చౌదరి నాగేష్

పెంచికలపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు రేంజ్ పరిధిలోని జైహింద్‌పూర్ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు వెళ్లిన అటవీ శాఖ అధికారులను అడ్డుకొని రైతులు మూడు రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారు. శనివారం రాత్రి సమ యంలో రైతు చౌదరి నాగేష్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆదివారం కూడా అధికారులు అక్కడి నుంచి వెళ్లక పోవడంతో పోడు రైతులు అక్కడే కూర్చున్నారు. ఈ సందర్భంగా రైతులు మా ట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు అధికారులు మొక్కలు నాటి అన్యాయం చేయవద్దని అన్నారు. ఆదివారం రాత్రి సైతం పలువురు అక్కడే నిద్రించారు.

మూడు నెలల బియ్యం పంపిణీ ప్రారంభం



మూడు నెలల బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

సిర్పూర్(టి), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలల బియ్యం పంపిణీని ఆదివారం ప్రారంభించారు. సిర్పూర్(టి) మండలంలోని 15 రేషన్ దుకాణాలు ఉండగా కొన్ని రేషన్ దుకాణాల ఇంకా బియ్యం స్టాక్ నిలువలు చేరుకోలేదు. ఈ విషయమై డీటీ బక్కయ్యను వివరణ కోరగా ఈ నెల 30 వరకు మండలంలోని అన్ని రేషన్ దుకాణాలకు స్టాక్ ఒకే సారి చేరుకుంటుందని చెప్పారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడికి మూడు నెలల బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం



మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ అవార్డు గ్రహిత మందకృష్ణ మాదిగను ఆదివారం ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకొని వరంగల్ పట్టణంలో కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ జాతీయ స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయనను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యశోద, మహేష్, కృష్ణవేణి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ ఆశయాల సాధనకు పాటుపడాలి



మాట్లాడుతున్న సేవాలాల్ సేనా రాష్ట్ర నాయకుడు శివప్రసాద్

ఆసిఫాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సేవాలాల్ మహారాజ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సేవాలాల్ మహారాజ్ జయంత్యోత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు, సేవాలాల్ సేనా రాష్ట్ర నాయకుడు బదావత్ శివప్రసాద్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సేవాలాల్ సేన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తుండడం సేవాలాల్ సేన కృషి ఫలితమేనని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

సిర్పూర్(యు), జూన్ 1 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన తాపి మేస్త్రీ గౌసోద్దీన్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆదివారం తాపి మేస్త్రీ మండల సంఘం సభ్యులు ఆయనను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మేస్త్రీ సంఘం మండల అధ్యక్షుడు ఆత్రం గంగారాం మాట్లాడుతూ కొన్ని రోజులుగా గౌసోద్దీన్ పనికి వెళ్లలేక పోవడం వల్ల కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మేస్త్రీ గౌసోద్దీన్ తొందరగా కోలుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గేడం నాగోరావు, సేడ్మకి బాపురావు, నైతం జంగు, పర్చాకి రాజు, మేస్రం సుభాష్, కుమ్రం సోము, భరత్, మారుతి పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు



ఆసిఫాబాద్‌లో విద్యుత్‌దీపాలతో అలంకరించిన కలెక్టరేట్

ఆసిఫాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. కలెక్టరేట్ కార్యాలయంలో సోమ వారం వేడుకలను నిర్వహించనున్నారు. ఇందు కోసం కలెక్టరేట్‌ను సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. వేడుకలకు తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఉదయం 9.45 గంటలకు అమర వీరుల స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పించనున్నారు. 10 గంటలకు పోలీసుల చేత గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం జిల్లా ప్రగతిపై ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ఆసిఫాబాద్‌లోని అంబేద్కర్ చౌక్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

పోలీసు సేవా పతకానికి ఏడుగురు ఎంపిక

ఆసిఫాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడకల్లో భాగంగా పోలీసులకు అందించే వివిధ రకాల సేవా పతకాల్లో భాగంగా పోలీసు సేవా పతకానికి జిల్లాకు చెందిన ఏడుగురు పోలీసులను ఎంపిక చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక కార్యదర్శి రవిగుప్త ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపికైన వారిలో కాగజ్‌నగర్ సీఐ రాజేంద్రప్రసాద్, ఆసిఫాబాద్ ఎస్సై శ్రీనివాస్, భరోసా సెంటర్ ఎస్సై తిరుమల, కాగజ్‌నగర్ ఏఎస్సై బాలాజీ, ఏఆర్ హెడ్ క్వార్టర్ ఆర్ఎస్సై శ్రీనివాస్, సిర్పూర్(టి) హెడ్ కానిస్టేబుల్ అజీముద్దీన్, ఏఆర్‌హెడ్ క్వార్టర్ హెడ్ కానిస్టేబుల్ ఇమామ్, బిశ్వజిత్‌లు ఉన్నారు .వీరంతా హైదరాబాద్‌లో అవార్డులు స్వీకరించనున్నారు.

మూతపడిన పాఠశాలను తెరిపించారు



విద్యార్థులు, పోషకులతో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్‌తాండ గ్రామంలో మూత పడిన పాఠశాలను టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో తెరిపించేందుకు కృషి చేశారు. టీఎస్‌యూటీఎఫ్ ప్రచార జాతలో బాగంగా గ్రామాన్ని సందర్శించారు. 15 ఏళ్ల క్రితం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మూత పడినట్లు తెలుసు కున్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సందర్శించి పాఠశాల ప్రారంభించినట్లయితే సుమారు 15 మంది పిల్లలను చేర్పించేందుకు పిల్లల తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి విషయాన్ని డీఈవో యాదయ్య దృష్టికి తీసుకెళ్లారు. డీఈవో స్పందించి పాఠశాల తెరి పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈవో రాథోడ్ సుభాష్, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ మధుకర్‌ను ఆదేశించారు. జిల్లాలో మూతపడిన పాఠశాలలు 36 వరకు ఉన్నాయని, తెరిపించేందుకు కృషి చేస్తామని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు తెలిపారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

వాంకిడి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కవిత తెలిపారు. 3న ఘాట్‌జనగాం, జైత్‌పూర్, 4న తేజాపూర్, చించోలి, బోర్డ, 5న నార్లపూర్, బెండర, 6న గుంజాడ, సమేల, 7న ఇందాని, 10న నీమ్‌గాం, నొక్కేవాడ, వెలిగి, కేడేగాం, 11న ఆర్లి, కనర్‌గాం, 12న ఆకిని, కోమటిగూడ, దేవుడపల్లి, 13న చిచ్చుపల్లి, లంజన్‌వీర, జంబులదరి గ్రామాల్లో ఉంటాయని తెలిపారు. 16న దాబా, వాంకిడి, కర్జు, వాంకిడి కలాన్, 17న సవ్వాతి, బంబార, 18న కిర్డి, సోనాపూర్, 19న చౌపన్‌గూడ, గోయగాం, మహాగాం, 20న నవేగాం, సర్కెపల్లిలో ఉంటాయని తెలిపారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామ్మోహన్ తెలిపారు. ఈ నెల 3 నుంచి 17వ తేదీ వరకు ఆ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే సదస్సుల్లో భూ సమస్యలకు సంబంధించిన పరిష్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం నుంచి 13తేది వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాట్లు తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్ తెలిపారు.ఈ నెల 3న రాఘాపూర్, సీతాగోందిలలో, 4న భూర్నూర్(బి), పంగడి, 5న సిర్పూర్(యు), బాబ్జీపెట్ గ్రామాల్లో ఉంటాయని చెప్పారు. 6న ధనోర(పి), శేట్టిహాడ్పూర్, 9న మహగాం, చాప్రి, 10న నేటూర్నార్, ఫుల్లార, 11న కోహినూర్(బి), దేవుడుపల్లి, 12న కోహినూర్(కే), 13న పాములవాడలో నిర్వహిస్తామని తెలిపారు. రెవెన్యూ సదస్సులను మండల రైతులు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్ సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా మిషన్ భగరథ నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌కు చెందిన మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రెండు నెలలుగా తాగునీరు రావడం లేదని చెప్పారు. స్థానికంగా బోర్‌వెల్ ఉండేదని అది కూడా చెడి పోయిందన్నారు. చెడిపోయిన ప్రతీ సారి కాలనీ వాసులు అందరు కొత్తం మొత్తం వసూలు చేసుకుని మరమ్మతులు చేయిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం బోరువెల్ పని చేయడం లేదని చెప్పారు. దీంతో కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. మున్సిపాలిటీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. విసుగు చెంది రోడ్డెక్కినట్లు వివరించారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా పరిష్కరించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాధవి, సుధాకర్, సుజాత, మేరాజ్ తదితరులు పాల్గొన్నారు.

6వ తేదీ నుంచి 19 వరకు

బడిబాట నిర్వహిస్తాం

● ఆడె ప్రకాష్, ఎంఈవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: బడిబాట ఎప్పటి నుంచి నిర్వహిస్తారు?

ఎంఈవో: బడి బాట మండల వ్యాప్తంగా జూన్ 6 నుంచి 19 వరకు నిర్వహిస్తాం. వ్యవసాయ, ఇతరాత్ర పనులకు వెళ్తున్న బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశాం.

ఆంధ్రజ్యోతి: బడిబాట ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి?

ఎంఈవో: ప్రతి గ్రామంలో ఐసీడీఎస్ టీచర్ల వద్ద జాబితా తీసుకుని ఐదేళ్ల విద్యార్థులను పాఠశాలల్లో చేర్పిస్తాం. ఐదో తరగతి పూర్తి అయిన విద్యార్థులను గుర్తించి సమీప ఉన్నత పాఠశాలల్లో చేర్పిస్తాం.

ఆంధ్రజ్యోతి: పాఠశాలల బలోపేతం కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎంఈవో: ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుకులు ఈ విద్యా సంవత్సరం నుంచి అందజేస్తాం. పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాం.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు ఏక రూప దుస్తులు అందజేస్తున్నారా?

ఎంఈవో: విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభానికి ముందే రెండు జతల ఏక రూప దుస్తులు అందజేస్తాం. ఈ మేరకు వేసవి సెలవులకు ముందే విద్యార్థుల నుంచి కొలతలు తీసుకున్నాం. ప్రభుత్వం సూచిన ప్రకారమే దుస్తులు అందజేసేందుకు సిద్ధం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మధ్యాహ్న భోజన మెనూ ఎలా ఉంది?

ఎంఈవో: వారానికి మూడు రోజులు గుడ్లు, మూడు రోజులు రాగి జావ సైతం ఉదయం అందిస్తున్నాం. నాణ్యమైన కూరగాయలు, పప్పులతో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందిస్తున్నాం.

- కెరమెరి, ఆంధ్రజ్యోతి



ఇప్ప పువ్వు సేకరిస్తున్న గిరిజనుడు (ఫైల్)

ఇప్పపువ్వు సేకరణ.. ఆదివాసీల ఆరాధన!

ఇప్ప చెట్టు ఆదివాసీల కల్పవృక్షంగా పేరుగాంచింది. వారికి పలు రకాల ఆదాయాన్ని సమకూర్చుతూ ఆర్థిక భరోసానిస్తోంది. కుమరం భీం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత అడవుల్లో విరివిగా కనిపించే ఇప్ప చెట్లకు ఆదివాసీ తెగలో కొందరు పూజలు చేస్తారు. ఇప్ప నుంచి వచ్చే పూలు, గింజలతో ఆదివాసీ తెగలకు ప్రత్యేక అనుబంధం ఉంది.

● ఆదివాసీల కల్పవృక్షం.. ఇప్ప చెట్టు

● అడవి బిడ్డలకు ఆర్థిక వనరుగా భరోసా

● బలవర్ధక మందుల తయారీలోనూ పువ్వు వినియోగం

జైనూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఆరాధ కులైన ఆదివాసీలు.. అడవుల్లో సహజ ద్ధంగా లభించే వివిధరకాల పదార్థాలు, వస్తువులకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తుంటారు. దాదాపు వారి ఆహారపు అలవాట్లతో పాటు పండగల సమయంలో అటవీ సంబంధితాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ముఖ్యంగా ఇప్ప పువ్వుతో వారికి అనుబంధం ఎక్కువగా ఉంటుంది. జిల్లా అడవుల్లో ఏటా ఏప్రిల్ ప్రారంభం నుంచే ఇప్ప పువ్వును సేకరిం చి భద్ర పర్చుకోవడం ఆదివాసీలకు ఆనవాయితీ. ప్రకృతిని పూజించే వారు ఇప్ప చెట్టుకు ప్రత్యేకపూజలు చేసి ఇప్పపువ్వు సేకరణను ప్రారంభిస్తారు. ఇప్పచెట్టును(భీమల్, ముర్ర, (భీమల్‌పేన్) భీమల్ దేవుడితో గుర్తిస్తారు. తెల్లవారుజామునే పశు వులను మేతకు వదలక ముందే అటవీ ప్రాంతంలో ఇప్పపువ్వు సేకరణకు వెళ్తారు. సేకరించిన ఇప్ప పువ్వును ఇంటి ఆవరణంలో ఎండబెడతారు. అవి నాలుగు, ఐదురోజులు ఎండిన తర్వాత పువ్వుతో గట్కా, గారెలు వంటి తిను బండారాలను తయారు చేస్తుంటారు. ఎండకాలంలో వాటిన ఆహారంగా తీసు కుంటారు. వీటితో తయారైన పదార్థాలను సేవించడం వల్ల ఆదివాసీల్లో రక్తహీ నత తదితర రుగ్మతలు దరి చేరకుండా ఉంటాయి. వన దేవ తల పూజల్లోనూ ఇప్పపువ్వును నైవేద్యంగా సమర్పిస్తారు.

లడ్డూల తయారీ..

ఇటీవల కాలంలో ఇప్పపువ్వుతో లడ్డూలు తయారు చేస్తు న్నారు. ఏటా వేసవి ప్రారంభం నుంచే ఆది వాసీలు ఇప్పపువ్వు సేకరణలో ఉంటారు. సాధారణ ంగా ఆదివాసీల్లోని గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో బాధ పడుతుంటారు. ఈ రుగ్మతను అధిగమించడానికి ఇప్పపువ్వుతో తయారైన వంటకాలు, పదార్థాలు కొంత మేర ఉపయోగకరంగా ఉంటాయని చెబుతారు. ఈ క్రమంలో ఆదిలా బాద్ జిల్లా ఉట్నూరు మండల కేంద్రంలో భీంబాయి సహకార సంస్థ ఆధ్వర్యంలో ఇప్ప పువ్వు లడ్డులను తయారు చేస్తున్నారు. వీటిని కొనుగోలు చేసి అధికారులు గర్భిణులు, బాలింతలకు అందిస్తున్నారు. ఒక లడ్డూ 20గ్రాముల బరువు ఉంటుంది. కిలో ఇప్ప పువ్వు లడ్డూల ధర 300లుగా నిర్ణ యించారు. ఇప్పగింజలతో నూనె తీస్తారు. ప్రాచీన కాలంలో ఆదివాసీ కుటుంబాలు వంటల తయారీ లోనూ ఇప్ప నూనె వాడు తుండేవారు. ప్రస్తుతం దైవా రాధనలో ఎక్కువగా వినియోగిస్తున్నారు.



ఇప్ప పువ్వుతో లడ్డూలు తయారు చేస్తున్న మహిళ

భారీగా తగ్గుతున్న చెట్లు..

గతంలో జిల్లాలోని అడవుల్లో ఇప్పచెట్లు అధిక సంఖ్యంలో ఉండేవి. ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు వేసవి కాలంలో ఉపాధినందించే ఇప్ప పువ్వు చెట్ల సంఖ్య రోజురోజుకు గణనీయంగా తగ్గుతుండడం ఆందోళన కల్గిస్తోంది. అడవుల్లో చెట్లు నరికే స్మగ్లర్లు ఇప్ప చెట్లను సైతం వదలడం లేదని గిరిజనులు చెబుతున్నారు. ఉపాధితో పాటు తమ సంప్రదా యాలను కోల్పోతామని వాపోతున్నారు. ఇప్పటికైనా ఏటా వానా కాలంలో అధికారులు ఇప్పచెట్లను విరివిగా నాటాలని గిరిజనులు కోరుతున్నారు.

లెదర్ పార్కును ప్రారంభించాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు విజయ్‌కుమార్

మందమర్రి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాణహిత కాలనీ పాలవాగు ఒడ్డున రెండు దశాబ్దాలక్రితం ఏర్పాటు చేసిన లెదర్ పార్కును వెంటనే ప్రారంభించాలని లెదర్ పార్కు జేఏసీ నాయకుడు విజయ్ కుమార్ అన్నారు. సింగరేణి పాఠశాల మైదానంలో ఆదివారం లెదర్ పార్కు సాధన సమితి సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 7కు పైగా లెదర్ పార్కులు ఉన్నాయని, ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం వాటిని ప్రారంభించాలని కోరారు. మందమర్రికి సంబంధించి లెదర్ పార్కు ఏర్పాటు చేయడం కోసం ప్రభు త్వానికి జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీలకు విజ్ఞప్తి చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో నెర్వెట్ల సుజిత్, ముల్కల్ల రమేష్, సురేష్, గడ్డం అనిల్, సాయికృష్ణ ఉప్పులేటి నరేష్, సుద్దాల జనార్దన్, వేల్పుల కిరణ్, కుమార్, పుల్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

దహెగాం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మర్రిపల్లి గ్రామంలో గడంబా స్థావరాలపై ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. మర్రిపల్లి గ్రామ సమీపంలో 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఎస్సై మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా విక్రయించినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆరోగ్య బీమా.. జీవితానికి ధీమా

తపాలా శాఖలో అన్ని వర్గాలకు అందుబాటులో పథకాలు

జైపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినా లేదా అనారోగ్య సమస్యలతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే ప్రస్తుత పరిస్థితుల్లో జేబులు గుల్లవడం ఖాయం. పలు ప్రైవే టు ఇన్సూరెన్స్ పాలసీలు ఉన్నా ప్రీమియం అధికంగా ఉండడంతో ప్రజాదరణ పొందలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా తపాలశాఖ ఆరోగ్య బీమా పథకాలను ప్రవేశ పెడుతోంది.

తక్కువ ప్రీమియంతో నివాబూపా, ఆదిత్య బిర్లా తదితర సంస్థల సహ కారంతో పథకాలు అందుబాటులో ఉన్నాయి.

పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు వేరు వేరుగా

ఈ పథకంలో చేరేందుకు 18నుంచి 60సంవ త్సరాల మధ్య వయ స్సున్న వారు అర్హులు. లక్ష రూపాయల నుంచి రూ.50లక్షల వరకు పొదుపు చేసుకోవడంతో పాటు ప్రమాద బీమా పొందవచ్చు. రూ. 20 లక్షలకు పైగా చేస్తే మాత్రం వైద్య పరీక్షల నివేదికలు జత చేయాలి. పాలసీని బట్టి ప్రీమియం ఉంటుంది. ఉదాహరణకు రూ. 10లక్షలు పొదుపు చేసుకునేలా ఈ పథకంలో చేరితే రూ. 10లక్షల ప్రమాద బీమాతో పాటు పట్టణ ప్రాంతాల్లో రూ.42వేలు బోనస్ చెల్లిస్తారు. దంపతుల్లో ఒక్కరు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌కు అర్హులైతే జీవిత భాగస్వామికి సైతం పథకం వర్తిస్తుంది.

కుటుంబ సభ్యులందరికీ వర్తింపు..

కుటుంబ సభ్యులందరికీ ప్రయోజనకరంగా ఉండేలా నివా హెల్త్ ఇన్సూరెన్స్ సహకారంతో బూపా హెల్త్ ప్లస్ ప్లాన్‌ను తపాల శాఖ ప్రవేశపెట్టింది. రూ. 10లక్షలు, రూ.15 లక్షల పాలసీలు కుటుంబంలో ఒక్కరికి రూ. 890, ఇద్దరికి రూ.1390, దంపతులు, ఒక సంతానానికి రూ. 1790, ఇద్దరికి రూ.2200 ప్రీమియం ఉంటుంది. రూ.2లక్షల వరకు ఆసుపత్రి బిల్లులు అయితే వినియోగదారులే భరించాలి. రూ.2 లక్షలకు పైగా ఖర్చులు తపాల శాఖ చెల్లిస్తుంది. ప్రమాదవశాత్తూ మృతి, శాశ్వత వైకల్యం, పక్షవాతం, అవయవాలు కోల్పోతే రూ. 15 లక్షల బీమా వర్తిస్తుంది. మృతిచెందితే అంత్యక్రియలకు రూ. 5 వేలు చెల్లిస్తారు. 18నుంచి 60సంవత్సరాల వరకు ఈ పథకంలో చేరవచ్చు. 20రోజుల అనంతరం నుంచి ఏడాదిలోపు ప్రయోజనాలు వరిస్తాయి.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- యోగేందర్, తపాలా శాఖ అధికారి, జైపూర్



అతి తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్‌తో జీవిత, ప్రమాద, ఆరోగ్య బీమాపథకాలను తపాల శాఖ అందుబాటులోకి తెచ్చింది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. సమీపంలోని పోస్టాఫీసులను సంప్రదించి నచ్చిన పథకంలో చేరవచ్చు. తపాల శాఖ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

బహుళ ప్రయోజనాలు

ఆదిత్య బిర్లా సహకారంతో గ్రూపు, పర్సనల్ విభాగాల్లో ఆరోగ్య బీమా పథకం 18 నుంచి 65 ఏండ్ల వారికి వర్తిస్తుంది. ఈ పథకంలో రూ. 549 ప్రీమి యంతో రూ. 10 లక్షలు, రూ. 749 ప్రీమియంతో రూ. 15 లక్షల పాలసీ తీసుకోవచ్చు. ప్రమాదవశాత్తూ మృతి, శాశ్వత వైకల్యం, అంగ వైకల్యానికి పూర్తి బీమా చెల్లిస్తారు. వైద్య సేవలకు రూ. 30 వేల నుంచి 60 వేల వరకు, విరిగిన ఎముకలకు చికిత్సకు, రూ. లక్ష వరకు ఇస్తారు. పాలసీదారుడు ప్రమాదవశాత్తూ మృతిచెందితే ఇద్దరు పిల్లలకు గరిష్టంగా రూ. లక్ష వరకు వర్తింప జేస్తారు.

రేపటి నుంచి పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆసిఫాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. 13వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు కొనసా గుతాయి. జిల్లాలో పరీక్షల నిర్వహణ కోసం మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 240 మంది విద్యార్థులు, కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 240 మంది, సిర్పూర్(టి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్ష లకు హాజరుకా నున్నారు. పరీక్షల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలని జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం ద్వారా రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ విద్యార్థుల ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్‌లో ఐదో తరగతి, నాన్ రెసిడెన్షియల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 16 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 20న లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. ఐదో తరగతిలో 40, ఒకటో తరగతిలో 38 సీట్లు ఉన్నాయని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి



ప్రచార జాతా ప్రారంభిస్తున్న ఎంఈవో సుభాష్

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైద్య శాంతికుమారి, ఊశన్న కోరారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రచార జాతాను ఆసిఫాబాద్ ఎంఈవో రాథోడ్ సుభాష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. విశాల మైన తరగతి గదులు, ఆట స్థలం ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా కమ్యూనిటీ కో ఆర్డినేటర్ మధుకర్, కేవీపీఎస్ నాయకులు దినకర్, డీవైఎఫ్ఐ నాయకులు టీకానంద్, మల్లేష్, సంజయ్‌కుమార్, లక్ష్మణ్, సలమ్, ఇందూరావు, రమేష్, సుభాష్, దుర్గయ్య, హేమంత్‌సిండె, రాజకమలాకర్ రెడ్డి, హరీష్, సంతోష్‌కుమార్, తిరుపి, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఎంఈవో రాథోడ్ సుభాష్ మల్టీజోన్1లో ఉత్తమ ఎంఈఓగా ఎంపిక కావడంతో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు.

నూతన గనుల ఏర్పాటుకు పోరాటం

మందమర్రి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థలో నూతన గనులను ఏర్పాటు కోసం హెచ్‌ఎంఎస్ రాజీలేని పోరాటాలకు సిద్ధంగా ఉందని హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకులు పార్వతి రాజిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడు తూ గత బీఆర్‌ఎస్ పాలనలో సింగరేణి కోల్కోని విధంగా నష్టపోయిందని తెలిపారు. నిధులను దారి మళ్లించి సిరిసిల్ల, సిద్దిపేటతో పాటు గజ్వేల్‌కు నిధులు మళ్లించారని తెలిపారు. వరదలు వచ్చినప్పుడు వేల కోట్లను దారి మళ్లించారని తెలిపారు. పదేండ్ల పాలనలో ఒక్క గని రాక పోగా సింగరేణికి ఆర్థిక దోపిడీ జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన ప్రాంతాల్లో గనులను ప్రారంభించాలని కోరారు. ఇప్పటికే మందమర్రికి సంబంధించి ఆర్కే 1 గని మూత పడిందన్నారు. కేకే 5 కూడా మూత పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దాదాపు 10కి పైగా గనులు మూత పడనున్నట్లు తెలిపారు. మరికొద్ది సంవత్సరాల్లో సింగరేణి ఎత్తివేసే అవకాశాలు లేకపోలేదని వారు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని టెండర్ ప్రక్రియ ద్వారా అయినా సాధించుకునేందుకు దృష్టి సారించాలని కోరారు. గత కొన్ని నెలలుగా మెడికల్ బోర్డు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకులు

యువత వ్యాయామంపై దృష్టి సారించాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం ఉండడం కోసం యువత యువత వ్యాయామంపై దృష్టి సారించాలని ఆర్ఎస్సై రాజేష్, గిరిజన క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు అన్నారు. మంగళవారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో ఆరోగ్య పరమైన అలవాట్లను పెంపొందించడం, సైక్లింగ్ ద్వారా శారీరక దృ డత్వాన్ని సాధించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడడం లక్ష్యంగా జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఫిట్ ఇండియా-సండేస్ ఆన్ సైకిల్ ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో ఆరోగ్య పరమైన అలవాట్లను పెంపొందించడంల సైకిల్ ఉపయో గించడం లాంటివి దోహదపడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో కనీసం ఒక్క రోజు సైక్లింగ్ చేయాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న అనారోగ్య సమస్యల నేపథ్యంలో సైక్లింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. యువత వ్యసనాల బారిన పడకుండా ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అత్యపత్య జిల్లా అధ్యక్షుడు భీంరావు, ఖేలో ఇండియా కోచ్ రాకేష్, శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.



వేడుకలకు ముస్తాబు చేసిన సింగరేణి స్టేడియం

వేడుకలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు

మందమర్రి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పాఠశాల మైదానంలో సోమవారం నిర్వహించే రాష్ట్ర అవతరణ వేడులకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని జీఎం దేవేందర్ అన్నారు. ఆదివారం ఏర్పాట్లు మందమర్రి జీఎం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవతరణ దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసి నట్లు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఏరియాల్లో ఉత్పత్తి, ఉత్పాదకత, విద్యుత్, తదితర వాటిపై ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ముందుగా జెండా ఆవిష్కరణ అనంతరం కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, తెలంగాణ గీతాన్ని గనుల, డిపార్టుమెంట్ల వద్ద గీతాలాపన చేయనున్నట్లు తెలిపారు. కార్మిక సంక్షేమం, ఆరోగ్యం, తదితర అంశాలకే పెద్దపీట వేస్తున్నామని జీఎం తెలిపారు.

సర్కారు బడి పిలుస్తోంది..

- ప్రైవేటుకు ధీటుగా ప్రచారం
- గ్రామాల్లో పోస్టర్లు..ఫ్లెక్సీల ఏర్పాటు
- సెలవుల్లో సైతం బడిబాట కార్యక్రమం
- అడ్మిషన్ల కోసం ఇంటింటికీ టీచర్లు



భీమినిలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న టీచర్లు

నెన్నెల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలకు పూర్వవైభవం తేవడం, విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రైవేటు మోజు నుంచి తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చి సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించేలా ఉపాధ్యాయులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకత గూర్చి వివరిస్తున్నారు. ప్రైవేటు స్కూల్స్‌లో చదివిస్తే రూ. 50 వేల నుంచి రూ. 1.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని.. ఆ డబ్బును ఆదా చేసి పిల్లల ఉన్నత చదువులకు వాడుకోవాలని సూచిస్తు న్నారు. ఉపాధ్యాయ సంఘాలు కూడా బడుల్లో పిల్లల చేరికల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట ప్రచార జాత ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతోంది.

ప్రైవేటు వైపే మొగ్గు..

సర్కారు విద్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాయి. కోట్లాది రూపాయలు వ్య యం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నాయి. చదువుతో పాటు యునీఫాం, పుస్తకాలు, నో ట్‌బుక్స్ సన్నబియ్యంతో భోజన సదుపాయం అమలు చేస్తున్నాయి. ఇందుకు పూర్తి భిన్నంగా ప్రైవేటు పాఠశాలల్లో ఉంటోంది. పుస్తకాలు, యునీఫాంలు కొనుక్కోవాలి. వేల రూపాయల ఫీజులు చెల్లించాలి. ఇంటి నుంచే టిఫిన్ బాక్సు తీసుకెళ్లాలి. అయినప్పటికీ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లోనే చదివించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతున్నాయి.

ముందుగానే బడిబాట

ప్రతిసారి జూన్‌లో బడిబాట నిర్వహిస్తుండటంతో అప్పటికే విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు పొందుతున్నారు. ఈ సారి వేసవి సెలవుల కంటే ముందే బడిబాట నిర్వహించి పిల్లలను చేర్చుకున్నారు. చదువుతో పాటు సౌకర్యాలు కల్పిస్తున్నామని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు పేరెంట్స్‌ను ఆకర్షిస్తున్నారు.

అపవాదును చెరిపేసేలా...

ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రద్ధతో పని చేయక పోవడమే ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కోల్పోవడానికి కారణమనే విమర్శలు ఉన్నాయి. పాఠశాల యాజమాన్య కమిటీలు ఉన్నమాటే గాని పాఠశాలపై అంతగా శ్రద్ధపెట్టడం లేదు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులను ఒప్పించి ప్రైవేటు బడుల్లో చేర్చుకుంటున్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ టీచర్లు పోటీపడక పోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించేందుకు పెద్దగా ఆసక్తి చూపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటి అపవాదును తొలగించుకోవడం కోసం ప్రభుత్వ టీచర్లు కృషి చేస్తున్నారు.

మొదటి రోజే పుస్తకాలు...

ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా ఇచ్చే పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులను పాఠశాల పునః ప్రారంభం రోజే అందజేయనున్నారు. ఈ పాటికే పుస్తకాలు, నోటుబుక్కులు బడులకు చేరుకున్నాయి. బోధనకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందుగానే పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నారు. పుస్తకలు పక్కదారి పట్టకుండా సీరియల్ నంబరు, క్యూఆర్‌కోడ్‌తో ముద్రించి ఇస్తున్నారు. దాన్ని స్కాన్ చేస్తే వివరాలన్ని తెలుసుకోవచ్చు.

జిల్లాలో 860 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 58,033 మంది చదువుకుంటున్నారు. వారికి అవసర మైన 40,2000ల పుస్తకాలు పాఠశాలకు చేర్చే పనిలో అధికారులున్నారు. మండల వనరుల కేంద్రం నుంచి ఇండెంట్ ఆధారంగా పుస్తకాలను పల్లెలకు పంపిస్తున్నారు.

సౌకర్యాల్లో బెస్ట్...

అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పాఠశాలల రూపు రేఖలు మార్చే విధంగా ఆధునిక హంగులతో తరగతి గదులు, ఫర్నీచర్, ఫ్యాన్లు, తాగునీటి వసతి, డైనింగ్ హాల్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించారు. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) నిధులతో ఎంపికైన స్కూళ్లలో అభివృద్ధి పనులను చేపడుతున్నారు. ఈ నిధులతో పర్యావరణ హితమైన గ్రీన్ పాఠశాలలుగా రూపొందిస్తున్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, లైబ్రరీలు, ఆట స్థలాల ఏర్పాటు, ఆర్వో ప్లాంట్లు, సోలార్ పవర్ లాంటి సౌకర్యాలను కల్పిస్తున్నారు.

ఇక ప్రీప్రైమరీ...

ప్రైవేటు పాఠశాలలకే పరిమితమైన ప్రీ ప్రైమరీ తరగతులను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభిస్తున్నారు. ప్రైవేటులో నర్సరీ నుంచే అడ్మిషన్లు ఉండటంతో ఎ క్కువ మంది పేరెంట్స్ తమ పిల్లలను ప్రైవేట్‌కు పంపేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో గవర్నమెంట్ ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరగలేని పరిస్థితి ఉంది. ప్రీ ప్రైమరీ తరగతులతో ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు పెరుగుతాయని అధికారులు అంటున్నారు.

ఏఐ బోధనలు

ప్రాథమిక విద్యార్థుల రీడింగ్, రైటింగ్ బేసిక్స్‌ను మరింత బలోపేతం చేసేలా కృత్రిమమేధతో విద్యాబో ధన చేస్తున్నారు. ఈ విధానం కొన్ని పాఠశాలల్లో విజ యవంతం కాగా అన్నింటిలో అమలుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు చక్కగా చదవడం, రాయడం, గణితంలో పట్టు సాధించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగపడుతుందని టీచర్లు చెబుతున్నారు.

రేషన్..పరేషాన్

(3వ పేజీ తరువాయి)

పెద్ద గదులు కిరాయికి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడున్న గదులకే కిరాయి చెల్లించేందుకు ఇబ్బందులు పడుతుండగా పెద్ద గదులను కిరాయి తీసుకొనే వెసులుబాటులేదని డీలర్లు వాపోతున్నారు. కొత్త గదులు తీసుకుంటే అద్దెభారం ఎలా మోయాలనే ఆందోళనలో వారు ఉన్నారు.

ఈ-పాస్ సాఫ్ట్‌వేర్‌లోను సమస్యలు...

జిల్లా వ్యాప్తంగా ఉన్న షాపుల్లో ఈ-పాస్ సాఫ్ట్‌వేర్ లోను అనేక సమస్యలు నెలకొన్నట్లు డీలర్లు చెబుతున్నారు. బయోమెట్రిక్ సమయంలో లబ్ధిదారుల వేలి ముద్రలు, ఐరిష్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సకాలంలో ఈ-పాస్ యంత్రాలు తెరుచుకోక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు డీలర్లు చెబుతున్నారు. ప్రస్తుతం మూడు నెలల బియ్యం ఒకే సారి పంపిణీ చేసేందుకు ఈ-పాస్ పరికరాలు సపోర్ట్ చేసే పరిస్థితి లేదనేది వారి వాదన. దీంతో పాటు ఇతర గ్రామాలకు చెందిన బియ్యం పోయడంలోను డీలర్లు అవస్థలు పడుతున్నారు. వాస్తవానికి ఒక రేషన్‌షాపు పరిధిలోని లబ్ధిదారులకు సరిపడ స్టాక్ మాత్రమే డీలర్లకు అందుతోంది. ఈ క్రమంలో ఇతర గ్రామాలకు చెందిన లబ్ధిదారులు కూడ చౌక దుకాణాల్లో బియ్యం తీసుకుంటుండడంతో అసలు లబ్ధిదారులకు కొరత ఏర్పడుతోంది. దీంతో డీలర్లు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం మూడు నెలలకు సరిపడా స్టాక్ అందించాల్సి ఉండడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వారికి సరిపడే స్టాక్‌ను సైతం తమకు అందించాలని డీలర్లు కోరుతున్నారు. జూన్‌కు సంబంధించిన రేషన్‌కోటా గత నెల 28వ తేదీలోపు షాపులకు చేరాల్సి ఉన్నా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో స్టాక్ షాపులకు చేరలేదు. ఈ క్రమంలోమూడు నెలల స్టాక్ పంపిణీ చేయడం సాధ్యం కాదనే అభిప్రాయంలో డీలర్లు ఉన్నారు. కేంద్రం సూచించిన మేరకు లబ్ధిదారులకు బియ్యం సరఫరాకావాలంటే పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి లబ్ధిదారుల సంఖ్యకు సరిపడా స్టాక్ ఉంచాలనే విజ్ఞప్తులు ఉన్నాయి.

కార్మికులకు సొంతిల్లు అమలు చేయాలి

శ్రీరాంపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు సొంతిల్లు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు రిటైర్ అయిన తరువాత ఇల్లు కట్టుకోలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కార్మికులకు సొంతిళ్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, దానిని నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

సింగరేణి కార్మికుల గొంతుక మునీర్

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్

మంచిర్యాలకలెక్టరేట్, జూన్1(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల గొంతుక సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ పేర్కొన్నారు. ఆదివారం మునీర్ కుటుంబ సభ్యులను మంచిర్యాలలో పరామర్శించారు. నాయకులు విజయ్, అబ్బాస్, శ్రీనివాస్, ఫారుఖ్, మయూర్, సాగర్, బిక్షపతి, సంతోష్, రాయమల్లు, రాజు, గణేష్, రాజశేఖర్, నందాని, మల్లేశ్, రాజేం దర్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని విశ్రాంతి భవనంలో లక్షెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో జర్నలిస్టు ఎండీ.మునీర్ మృతికి ఆదివారం పాత్రికేయులు సంతాపం ప్రకటించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు చింత అభినయ్‌తో పాటు జర్నలిస్టులు వై.శ్రీనివాస్, గడ్డం వినీత్ పాల్గొన్నారు.

కాసిపేట: ఎండీ మునీర్ మృతి పట్ల ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఘన నివాళులు అర్పించారు. మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య మాట్లాడుతూ మునీర్ జర్నలిస్టుగా ఎన్నో విశిష్ట సేవలందించారన్నారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రజా సంఘాల నాయకులు సిలోజి మురళి, చినబీ మయ్య పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఎల్లారం

కన్నెపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి మండలంలోని ఎల్లారం పోచమ్మ తల్లి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పోచమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఎల్లారం పోచమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లిం చుకున్నారు. అంతకుముందు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. ఎన్నికల సమయంలో తాను గెలిస్తే మేకతో మొక్కు చెల్లించుకుంటానని మొక్కిన సందర్భంగా పోచమ్మ తల్లిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని తల్లిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఆయన వెంట సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాధవరపు నర్సింగరావు, మాజీ ఎంపీపీ స్రుజ, నాయ కులు ఉన్నారు. కాగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడగా స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి, జూన్1 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామానికి చెందిన తీగల అశ్రిత్ రాష్ట్ర స్థాయి జేఈఈ ప్రవేశ పరీక్షలో ర్యాంక్ సాధించి సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించుకున్నందుకుగాను అభినందించి ల్యాప్‌టాప్ అందజేశారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉన్నత విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ల్యాప్‌టాప్‌లు అందజేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటా యిస్తూ ముందుకు వెళ్తుందన్నారు. మారుమూల గ్రామానికి చెందిన వి ద్యార్థి జాతీయ స్థాయిలో రాణించడం గొప్ప విషయమని ఇతర విద్యా ర్థులు అశ్రిత్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చదువులో రాణించినప్పుడే విద్యార్థులు భవిష్యత్‌లో మంచి స్థాయికి ఎదుగుతారని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరిక్రిష్ణ, నాయకులు రత్నం ప్రదీప్, రమేశ్, మేరుగు శ్రీనివాస్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు

జర్నలిస్టుకు ఘన సన్మానం

శ్రీరాంపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ (టీజేఎఫ్) మంచిర్యాల తూర్పు జిల్లా నుంచి పాల్గొని రాష్ట్ర సాధనకు కృషి చేసిన కోల్‌బెల్ట్ సీనియర్ రిపోర్టర్, టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ల రాజేశంను రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ ఘనంగా సన్మానించారు. సింగరేణి జేఏసీ కో కన్వీనర్‌గా, సకల జనుల సమ్మెలో భాగంగా 44 రోజుల దీక్షలో పాల్గొనడమే కాకుండా సాగరహారం, మిలీనియం మార్చ్‌లో పోరాడి, జర్నలిస్టుగా తన వంతు వార్తా కథనాలతో కార్మికులు, ప్రజలను చైతన్యపరిచి ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించారన్నారు. ఈ సందర్భంగా పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మర్ క్యాంపు విజయవంతం

నెన్నెల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆడుతూ పాడుతూ నేర్చుకుందాం అంటూ వేసవి సెలవుల్లో నిర్వహించిన క్యాంపు విజయవంతమైందని నిర్వాహకులు కొండపర్తి వెంకటేష్ తెలిపారు. 80 మంది పిల్లలతో మే 5న ప్రారంభించిన ప్రత్యేక తరగతులు ఆదివారంతో ముగిశాయని చెప్పారు. వివిధ రకాలుగా విద్యార్థుల సామర్థ్యాలను పెపొందించామని, యోగాపై అవగా హన కల్పించామని తెలిపారు. దాతల సాయంతో పిల్లలకు అవసరమైన స్టేషనరీ, స్కూల్ బ్యాగ్స్ అందజేశామన్నారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి సురేష్‌లు క్యాంపు నిర్వహనకు సహకరించారని పేర్కొన్నారు.



సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో పిల్లలు

దేవాపూర్‌లో బైక్‌ర్యాలీ

కాసిపేట,జూన్1(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగబోయే ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా ఆదివారం సత్యపాల్‌రావు యూనియన్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా కొమురంభీం చౌరస్తా వద్ద భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దేవాపూర్, నట్టుగూడ, రాంపూర్, అచ్యుత్‌రావుగూడెం, పాత అంగడిబజార్ ఏరియా మీదుగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు సత్యపాల్‌రావు మాట్లాడుతూ ఓరియంట్ సిమెంట్ ఎన్నికల్లో స్థానికంగా ఉండి కార్మికుల సమస్యలపై పోరాడే నాయకుడిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

●రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఓరియంట్ ఎన్నికల్లో సత్యపాల్‌రావుకు సంపూర్ణ తెలుపుతున్న ఒక ప్రకటనలో తెలిపారు. సత్యపాల్‌రావు తండ్రి రఘుపతిరావు ఐఎన్‌టీయూసీలో క్రియాశీల పాత్ర పోషించినందుకే పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలి

ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

లక్షెట్టిపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో మంజూరు అయిన లబ్ధిదారులు వెంటనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. పట్టణంలోని ఎస్‌పీఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల విడతల వారిగా అర్హులైన ప్రతీ ఒక్కరికి మంజూరు అవుతాయని ఎవరూ నిరాశ చెందకూడదన్నారు. ఎవరికీ ఒక్క పైసా కూడా లంచం ఇవ్వకూడ దన్నారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందజేసారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు పింగళి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్, పూర్ణ చందర్‌రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, ఆర్టీఏ డైరెక్టర్ అంకతి శ్రీనివాస్, నాయకులు తోట రమేష్, ముత్తె సుధాకర్, కందుల మోహన్ పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు

దండేపల్లి: కుల, మతాలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. ఆదివారం దండేపల్లి మండలం మేదరి పేటలో ఇందిరమ్మ ఇళ్ల, రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందన్నారు. భూ సమస్య పరిష్కారానికి ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తోందన్నారు. మండలంలో అర్హులైన 600 మందికి పైగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. కడెం ప్రాజెక్టు, గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలోని ఆయకట్టు భూములకు రెండు పంటలకు సాగునీరు అందిస్తున్నప్పటికీ గోదావరి బెల్ట్ ప్రాంత భూములను సస్యశ్యామలం చేయడానికి త్వరలో మండలంలోని గుడిరేవు, ద్వారక లక్షెట్టిపేటలో మోదెల గ్రామాలోని ఎత్తిపోతల పథక నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చందు, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సవఘటన్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, పార్టీ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీష్, తహసీల్దార్ రోహిత్ దేశ పాండే, ఎంపీడీవో ప్రసాద్, మాజీ జడ్పీ వైస్ చైర్మపర్సన్ ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, కాంతరావు, ఎంపీవో విజయప్రసాద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

●దండేపల్లి శివారులో సాగునీటి కాలువతో ప్రమాదశాత్తు ఆటో ట్రాలీ బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన దండేపల్లి చెందిన నలుగురు ఉపాధి కూలీలకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఎక్స్‌గ్రేషియా చెక్కులను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అందజేశారు. గత ఎడాది మే 17న పని ము గించుకుని ఇంటికి ఆటో ట్రాలీలో వస్తుండగా సాటునీటి కాలువలో పడి గాయపడిన వేమునూరి కమలకు రూ. 1,18,819, గొప హేమకు రూ 67, 499, ఎనగందుల స్వప్నకు రూ. 32,558, బొమ్మెన సుజాతకు రూ. 56, 755 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. దండేపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను విరమించుకోవాలి

మంచిర్యాలక్రైం,జూన్1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను విరమించుకోవాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బట్టారి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుతామని హామీ ఇచ్చి అలాకాకుండా జీవో ఎంహెచ్ నెంబర్ 25ను పరిగణలోకి తీసుకొని 1267 అనే ప్రొసిడింగ్ విడుదల చేస్తూ సర్దుబాటు పేరిట ఉత్తర్వులు జారీ చేయడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంచాలని, అందుకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని చెప్పిన అధికారులు సర్దుబాటు పేరిట ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా చేయడానికి పూనుకుంటుంద ని విమర్శించారు. జూన్ 12 నాటికి సర్దుబాటు చేసినట్లయితే నూతనంగా జూన్ నుంచి జులై వరకు దాదాపు పాఠశాలలో ప్రవేశాలు జరుగుతాయని ప్రభుత్వం సర్దుబాటు ప్రక్రియను జులై వరకు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో 20 సబ్జెక్టులకు ఒక్కరు ఇద్దరు ఉన్న పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులు చెప్పమనడం సరైందికాదన్నారు. ఉపాధ్యాయులను తీసివేయాలని ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పూనుకుంటుందన్నారు. వెంటనే సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు అర్సనపల్లి సత్తయ్య, సుమన్‌లు పాల్గొన్నారు.

ధాన్యాన్ని పట్టుకున్న రైతులు

చెన్నూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మాయమాటలు చెప్పి అదనంగా వేసిన తూకం ధాన్యాన్ని సొంతం చేసుకునేందుకు ప్రయత్నించగా రైతులు పట్టుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం చెన్నూరు మండలంలోని శివలింగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ధాన్యంలో నాణ్యత తరుగు పేరిట అధిక తూకం వేస్తున్నారు. ఎప్పటిలాగే ఆదివారం శివలింగాపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతుల నుంచి 43 కిలోల చొప్పున ధాన్యాన్ని తూకం వేసి బస్తాలను లారీలో ఎక్కించారు. స్థలం లేదంటూ కొన్ని బస్తాలను లారీ క్యాబిన్‌లో వేయగా రైతులకు అనుమానం వచ్చింది. ధాన్యం బస్తాలతో లారీ వెళ్తుండగా వెంబడించారు. కొంత దూరం వెళ్లిన తర్వాత లారీని ఆపి క్యాబిన్‌ను చూడగా బస్తాలు లేకపోవడంతో రైతులు కంగుతిన్నారు. దీనిపై లారీ చోదకున్ని ప్రశ్నించగా అసలు విషయం వెలుగు చూసింది. బస్తాలను ఆటోలో తీసుకువెళ్లారని చెప్పడంతో రైతులు ఆందోళన చేపట్టారు. 12 ధాన్యం బస్తాలను చెన్నూరులోని ఓ వ్యాపారికి విక్రయించినట్లు తెలిసింది. కొన్ని రోజులు గా నిర్వహకులు ఇలాగే చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.

సీపీఐ మండల సభను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ మండల సభను విజ యవం తం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. కృష్ణాకా లనీలోని యూనియన్ కార్యాలయంలో ఆర్కే 6, కృష్ణకాలనీ శాఖ కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, కోశాధికారుల సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కారుకూరి నగేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 21, 22 తేదీలలో మంచిర్యాలలో జిల్లా మహాసభలు ఉన్నాయన్నారు. వాటి తో పాటు ఈ నెల 8న జరిగే నస్పూర్ మండల మహాసభకు తరలిరావాలని కోరా రు. సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మేకల దాసు మాట్లాడుతూ, ఎఫ్ఎస్‌సీ కారులు ఇవ్వడంలో జాప్యం చేయవద్దని కోరారు. నూత న పెన్షన్లను అర్హులకు అందించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐవైఎఫ్ జిల్లా లింగం రవి, సీపీఐ జిల్లా కార్యదర్శులు సంఘం సదానందం, చిలుక రామచంద్రం, బాలసాని లక్ష్మ ణ్, ఆడెపు మల్లికార్జున్, శ్రీరాంపూర్ శాఖ సహాయ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

అధ్యాపకులకు వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి

మంచిర్యాలక్రైం, జూన్1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల నూతన అధ్యాపకులకు రెండవ వార్షిక ఇంక్రిమెంటు మంజూరు చేయాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఇంటర్ విద్యాధికారి జయ ప్రదబాయికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండి ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత రెండు సంవత్సరాలకుపైగా పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్‌లను జీవో 16 ప్రకారం క్రమబద్ధీకరించాలని, మే 3, 2003 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 3200 మంది రెగ్యులర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారని మొదటి వార్షిక ఇంక్రిమెంట్‌ను తీసుకున్నామని, 2వ ఇంక్రిమెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసు రూల్స్ 1996, రూల్‌నెంబర్ 18 ప్రకారం రెండు సంవత్సరాలు ఎలాంటి డిసిప్లనరీ కేసులు లేకుండా ప్రొబేషన్ పీరియడ్ కంప్లీట్ చేయడం జరిగిందన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఇంక్రిమెంట్‌లు అమలు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు నారాయణరెడ్డి, సునిత, షర్ఫోద్దీన్, శైలజ, సత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ సంఘం నాయకులు



రేషన్..పరేషాన్

ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీపై మల్లగుల్లాలు

- ఒక నెలకే సరిపడా నిలువలు ఉన్నట్లు అంచనా
- స్టాక్ నిల్వ చేసేందుకు డీలర్ల అవస్థలు
- ఈపాస్ సాఫ్ట్‌వేర్‌లోనూ అనేక సమస్యలు
- కేంద్రం ఆదేశాలతో సర్కారు కసరత్తు



మంచిర్యాల, జూన్1(ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపు ద్వారా లబ్ధిదారులకు ఈసారి మూడునెలలకు సంబంధించి బియ్యం ఇచ్చే పరిస్థితి జిల్లాలో కానరావడం లేదు. వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జూన్, జూలై, ఆగస్టు నెలకు సంబంధించిన బియ్యాన్ని జూన్‌లోనే ఏకమొత్తంగా పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించింది. ఈనేపథ్యంలో రాష్ట్రంలో మూడు నెలలకు సంబంధించి సన్నబియ్యం ఒకేసారి పంపిణీ చేసేందుకు పరిస్థితులు అనుకూలించేలా లేవు. జిల్లాలో ఏ నెలకు ఆ నెల పంపిణీ చేసేందుకు సరిపడా స్టాకు అందుబాటులోలేక డీలర్లు ఆగమాగమవుతుండగా లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కొంతకాలంగా ప్రతి నెల బియ్యం పంపిణీ చేయ డంలో ఆలస్యం జరుగుతుండడమే దీనికి నిదర్శనం. మండల లేవల్ స్టాకిస్టు (ఎంఎల్ఎస్) పాయింట్లలో సరిపడా నిల్వలు లేకపోవడంతో ప్రతీనెల 1నుంచి 15వతేదీలోపు పంపిణీ చేయాల్సిన బియ్యం నెలాఖరు వరకు కూడ అందడం లేదు. ముఖ్యంగా స్టేజ్-1 కాంట్రాక్టర్ నిర్లక్ష్యంవల్ల ఎంఎల్ఎస్ పాయింట్లకు సకాలంలో బియ్యం సరఫరా ఉండడం లేదు. దీంతో నిర్ణీత సమయానికి బియ్యం పంపిణీ చేయలేక డీలర్లు అనేక అవస్థలు పడుతున్నారు. ఈక్రమంలో కేంద్రం ఆదేశించిన మేరకు వర్షా కాలానికి సంబం ధించిన మూడునెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయడం డీలర్లకు సవాలుగా మారింది.

ఒక నెల స్టాక్ మాత్రమే పంపిణీ...

ఇదిలా ఉండగా జిల్లాలో ఉన్న మొత్తం 423 షాపుల్లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు చౌకధరల దుకాణాలకు నెలకు సరి పడా స్టాకు మాత్రమే పంపిణీ జరిగినట్లు తెలు స్తోంది. స్టేజ్-1 కాంట్రాక్టర్ నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు సకాలంలో బియ్యం సరఫరా కాక పోవడంతో ఉన్న స్టాక్‌ను తాత్కాలికంగా పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ప్రతీ నెల 31వ తేదీలోపు ఆ తరువాత నెలకు సంబంధించిన స్టాక్ చౌకధరల దుకాణాలకు చేరాల్సి ఉంది. అయితే నెల గడిచి 2వ తేదీ సమీపించినప్పటికీ ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో స్టాక్ చౌకదరల దుకాణాలకు చేర లేదు. దీంతో లబ్ధిదారులకు మూడు నెలల బియ్యం ఎలా పోయాలో తెలియక డీలర్లు తలలు పట్టుకుంటు న్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతినెల ఒక్కో షాపునకు సగటున 80 క్వింటాళ్ల బియ్యం అవసరం ఉంటుంది. ఆ లెక్కన జిల్లాలోని షాపులకు బియ్యం సరఫరా చేసేందుకు కనీసం మూడులక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ అవసరం ఉంటుంది. కేంద్రం సూచించిన మేరకు మూడునెలలు పంపిణీ చేయా లంటే దాదాపు 9లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంటుందని అంచనా.

అద్దెలు చెల్లించేది ఎలా...?

ప్రస్తుతానికి జిల్లాలో ఉన్న రేషన్‌షాపులు ఇరుకు అద్దె గదుల్లో నడుస్తున్నాయి. ఏ నెలకు ఆ నెల బియ్యం స్టాకు ఉంచేందుకే డీలర్లు అవస్థలు పడుతున్నారు. ఒకేసారి మూడు నెలల బియ్యం స్టాక్ చేయాల్సి వస్తే పరిస్థితి ఏంటని డీలర్లు వాపోతున్నారు. మూడు నెలల బియ్యం స్టాక్ ఉంచాలంటే ప్రస్తుతం ఉన్న గదులకు మూడంతలు...

(తరువాయి 5లో)

యువత సత్ప్రవర్తనతో మెలగాలి

- లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

లక్షెట్టిపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): యువత సత్ప్రవర్తన క్రమశిక్షణతో మెలగాలని చెడు వ్యసనాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు గురువులు చెప్పిన విధంగా నడుచుకోవాలని లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: యువతకు మీరిచ్చే సూచన ఏంటి..?

ఎస్సై: యువత గంజాయి, జూదం లాంటి వాటికి అలవాటు పడ కూడదు. వాటి వల్ల జీవితాలు నాశనం అవుతాయి. వాటి నిర్మూళన కోసం పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు కూడా తీసుకుంటోంది. గ్రామాల్లో, పట్టణాల్లో వాటి నిర్మూళన కోసం కళాకారులచే అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు మీరు ఇచ్చే సూచనలు ఏంటి..?

ఎస్సై: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. ముఖ్యంగా బైక్స్ నడిపేవాళ్లు హెల్మెట్ ధరించాలి. కారు నడిపేవాళ్లు సీట్ బెల్టు పెట్టుకోవాలి. వీటితో పాటు ప్రతీ ఒక్కరూ వాహన పత్రాలు కలిగి ఉండాలి. మద్యం సేవించి వాహనాలు నడపకూడదు.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో యువత రాష్ డ్రైవింగ్‌పై ఆరోపణలు ఉన్నాయి. మీ దృష్టికి వచ్చిందా..?

ఎస్సై: యువత బైక్‌లకు పెద్దపెద్ద సైలెన్సర్లు అమర్చుకుంటే వాటిని తొలగిస్తున్నాము. రాష్ డ్రైవింగ్ చేసి బైక్ రైడ్స్ నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాము. మైనర్లకు ఎవరైనా వాహనాలు ఇస్తే వాళ్ల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మైనర్లు నడుపుతున్న వాహనాలు ప్రమాదాలకు గురైతే మైనర్లతోపాటు వాహనాలు ఇచ్చిన వారిపైనా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: దొంగతనాల నివారణకు ఏలాంటి చర్యలు చేపడుతున్నారు...?

ఎస్సై: చోరీలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ ప్రత్యేకంగా బలగాలను ఏర్పాటు చేసి రాత్రిల్లు గస్తీలు నిర్వహిస్తున్నాం. ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసాం. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెబుతూ గ్రామాల్లో పట్టణంలో అక్కడక్కడ గ్రామ పోలీసు ఫోన్ నంబర్లను కూడా రాసి పెడుతున్నాం.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

5



ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ఇప్పపువ్వు సేకరణ.. ఆదివాసీల ఆరాధన!

- ఆదివాసీల కల్పవృక్షం.. ఇప్ప చెట్టు
- అడవి బిడ్డలకు ఆర్థిక వనరుగా భరోసా
- బలవర్ధక మందుల తయారీలోనూ పువ్వు వినియోగం

4



ప్రభుత్వ బడిని కాపాడుకుందాం

- పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పిద్దాం..



గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

జన్నారం, జూన్1(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణు పిలుపునిచ్చారు. శవావారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కోసం టీఎస్‌యుటీఎఫ్ మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రచారజాత జన్నారం మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలాలు ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామానికి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జూన్5 వరకు ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఈసందర్భంగా జన్నారం మడలంలోని తిమ్మాపూర్, రాంపూర్, తపాలాపూర్, చింతగూడ, పొన్కల్, జన్నారం, సూరారం, గూడెం, రేండ్లగూడలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు చంద్రమౌళి, నర్సయ్య, దండేపల్లి మండలం అధ్యక్షులు తులసి పతి, జన్నారం మండలం ప్రధాన కార్యదర్శి నర్సయ్యలు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ సేవలు స్ఫూర్తి దాయకం

- కలెక్టర్ కుమార్ దీపక్



జిల్లా అదనపు కలెక్టర్ దంపతులను సన్మా నిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలకలెక్టరేట్, జూన్1 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్‌గా సబావత్ మోతిలాల్ సేవలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ పదవీ విరమణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, నాయకులు, పలు రంగాల ప్రజలు జిల్లా అదనపు కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని రెవెన్యూశాఖలో సుదీర్ఘకాలం 40 ఏళ్లుగా విధులు నిర్వహించి క్రమశిక్షణ ఉద్యోగిగా గుర్తింపు సాధించం సంతోషదాయకమన్నారు. వారి అనుభవాలు సేవలు భవిష్యత్‌తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయన్నారు. వారి బావిజీవితం ఆయురారోగ్యాగలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు దుర్గప్రసాద్, కిషన్, వెంకటేశ్వర్లు, రాజవీరు, మీ సేవా నిర్వాహకులు నరేశ్, మండల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన పెద్ద పోచమ్మ కొలుపు



పోచమ్మ కొలుపులో భాగంగా పోతరాజుల విన్యాసాలు

నస్పూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం ప్రశాంత్ నగర్‌లో పెద్ద పోచమ్మ, భూ లక్ష్మీ, మహాలక్ష్మిల కొలుపు పూజలు ఆదివారం ఉదయం గావుపిల్ల కార్యక్రమంతో ఘనంగా ముగిసాయి.. రెండు రోజుల నుంచి గ్రామ దేవతలకు కాలనీ వాసులు పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం మొదలైన పూజలు ఆదివారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. పోతరాజుల పూజారుల బృందంచే జమిడిక మోతలు, డప్పు చప్పుళ్ళతో దేవత కొలుపు అంగరంగవైభవంగా భూలక్ష్మీ, మహాలక్ష్మీ, పెద్ద పోచమ్మ కొలుపు కాలనీ వాసుల భక్తి శ్రద్ధల పూజలతో చేపట్టారు. కాలనీ వాసులను పిల్ల పాపలను చల్లంగా చూడమని దేవతలను పూజించారు. ఆదివారం ఉదయం గ్రామ దేవతల ప్రతిష్ఠాపన, గావు పిల్ల కార్యక్రమంతో పూజలు ముగిసాయి.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు

హాజీపూర్, జూన్1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం దొనబండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమా వేశంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇంటి పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైనవారందరికి ఇందిరమ్మ ఇండ్లతో పాటు రాజీవ్ యువశక్తి పథకాలు అందిస్తామని తెలిపారు. విడతల వారి గా మంజూరవుతాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు తమ ఉనికి కోసమే తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్దిదారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బుకింగ్ లేక.. ఇసుక కొరత

- పది రోజులుగా తాపీమేస్త్రీలకు, కూలీలకు ఉపాధి కష్టాలు




బెల్లంపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి నియో జకవర్గంలోని పలు మండలాల్లో పది రోజులుగా ఇసుక కొరత ఏర్పడింది. దీంతో ఇండ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. రెండు వారాలుగా ఇసుక ఆన్‌లైన్ నిలిచి పోవడంతో ఇంటి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచి పోతున్నాయి. ఇసుక లేనికారణంగా కూలీలకు ఉపాధి దొరకడం లేదు. దీంతో కూలీలు పనులు దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన ఇసుక బుకింగ్..

తాండూర్, బెల్లంపల్లి మండలం, పట్టణం, కాసిపేట మండలా లకు నెన్నెల మండలంలోని ఖర్జీలోని ఇసుక రీచ్ నుంచి ఇసుక వస్తుంది. ఆన్‌లైన్ పద్ధతి ద్వారా ఇసుకను సంబంధిత మైనింగ్ శాఖ అధికారులు కేటాయిస్తారు. ప్రతి రోజు బెల్లంపల్లి మండలంతో పాటు పట్టణానికి దాదాపు 250కిపైగా ట్రిప్పులు, కాసిపేట, తాండూర్ మండలాలకు 100 ట్రిప్పుల చొప్పున సంబంధిత ట్రాక్టర్ యజమానులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి ఇసుక సరఫరా చేస్తారు.

నియోజకవర్గంలోని పలు మండలాలతో పాటు గ్రామాలకు తదితర ప్రాంతాలకు నెన్నెల మండలంలోని ఖర్జీవాగు రీచ్ నుంచి స్లాట్ బుకింగ్ ద్వారా ఇసుక రవాణ జరుగుతుంది. బుకింగ్ చేసుకున్న రెండు మూడు రోజుల్లో ఇసుక ఇంటికి వచ్చేది. అయితే ఖర్జీ వాగు ఇసుక రీచ్ వద్ద బురద మయం కావడంతో ట్రాక్టర్లు వెళ్లలేకపోతున్నాయి. ఈ రహదారిగుండా ట్రాక్టర్‌లు ఇసుక రవాణ చేయలేని పరిస్థితి ప్రతి ఏటా ఏర్పడుతోంది. దీంతో రెండు వారాలుగా ఇసుక లైన్ బుకింగ్ లేక ఇసుక దొరకని పరిస్థిది ఎదురై నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.

ఉపాధి దొరకడం లేదు..



రాంకుమార్, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు

ఇంటి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో తాపీ మేస్త్రీలకు, కూలీలకు పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు చౌరస్తా వద్ద కూలీ పనుల కోసం వేచి చూస్తున్నారు. పనికి వెళితేనే ప్రతి రోజు వచ్చే డబ్బులతో కుటుంబ పోషిస్తారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

భీమారం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే పీడీయాక్టు నమోదు చేస్తామని భీమారం ఎస్ఐ శ్వేత పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఎల్కేశ్వరం గ్రామంలో రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్లైసిల్ విత్తనాలు కొనుగోలు చేయవద్దని పేర్కొన్నారు. నకిలీ విత్తనాల వల్ల దిగుబడి రాదని, రైతులు నష్టపోతారని తెలిపారు. లైసెన్స్ ఉన్న ఫెర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

- కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

మంచిర్యాలకలెక్టరేట్, జూన్1 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఉద్యమాలు, బలిదానాలకు, రాస్తారోకోలు, రైలు రోకోలు, వంటావార్పులు.. ఇలా తెలంగాణ రాష్ట్రంకోసం చేసిన ఉద్యమాలకు జూన్ 02, 2014వ యేట తెర పడింది. కోట్ల మంది ఆందోళనలను, అనేక ఉద్యమాలు ఆత్మబలిదానాలను గుర్తించిన అప్పటి కేంద్రప్రభుత్వం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించింది.

కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాట్లు..

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ సలహాదారు హర్కర వేణు గోపాల్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉదయం 9.30గంటలకు బైపాస్ రోడ్డుకుగల అమర వీరుల స్థూపంవద్ద నివాళులు అర్పించి పూలమాలలతో నివాళులు అర్పిస్తారు. ఉదయం బైపాస్ రోడ్డున గల స్థూపంవద్ద నివాళులు అర్పించనున్నారు. అనంతరం తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తారు. అనంతరం పోలీసుల గౌరవవందన స్వీకారం, ఉదయం 10గంటల నుంచి 10.10గంల వరకు జాతీయ పతాకావిష్కరణ ఉంటుందని తెలిపారు. జిల్లా అధికారులు ఉద్యోగులు, ప్రజలు వేడుకలకు హాజరై పాల్గొనాల్సిందిగా కలెక్టర్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

మందమర్రిరూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్నారం జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 2006-07 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళ నాన్ని ఘనంగా నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అప్పుడు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెంచాల మధు, కొట్రంగి రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

భీమారం : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో 2001-02 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి మధుర జ్ఞాప కాలను గుర్తుకు తెచ్చుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పుడు విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు, సత్యనారాయణరెడ్డి, సత్యనారాయణ, జగన్‌మోహన్‌రెడ్డి, పవన్, పూర్వ విద్యార్థులు తిరుపతి, లావణ్య, సమ్మయ్య, లక్ష్మణ్, కమలాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్ : మండలంలోని ముల్కల్ల జడ్పీహైస్కూల్‌లో చదివినటువంటి 2005-06 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 19 ఏళ్ల అనంతరం అందరూ కలిసి ఒకచోట చేరి వారివారి గుర్తులను నెమరువేసుకున్నారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు ముఖ్య అతిథిగా పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, గణపతిరెడ్డి, సాగర్, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు నాయికని సురేందర్, వినీష్ పాల్గొన్నారు.

దొనబండ జడ్పీ హైస్కూల్‌లో...

దొనబండ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2006-07 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన ఘనంగా నిర్వహించారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను శాలువాలతో సన్మానించారు. సుమారు 70మంది విద్యార్థులు అపూర్వకలయికతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.



ముల్కల్ల జడ్పీహైస్కూల్‌లో 2005-06కు చెందిన పూర్వ విద్యార్థులు



మందమర్రి పొన్నారం జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు



భీమారంలో సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



దొనబండ జడ్పీహైస్కూల్‌లో 2006-07కు చెందిన పూర్వ విద్యార్థులు